రేపు తల్లాడకు కేటీఆర్ రాక

మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ వైర్మన్ మహేశ్

సత్తుపల్లి, మే 7: తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో డీసీసీబీ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణకు శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో ఆయన పర్యటనను విజయవంతం చేయాలని సత్తుపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేశ్ పిలుపునిచ్చారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సండ్ర ఇప్పటికే మండలాల్లో ముఖ్యకార్యకర్తల సమావేశాలు ఏర్పాటుచేసి కేటీఆర్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లు అంకంరాజు, మాధురిమధు, నరుకుళ్ల శ్రీనివాసరావు, మేకల నర్సింహారావు, గుండ్ర రాఘవేంద్ర, షేక్ చాంద్‌పాషా, అద్దంకి అనిల్, నడ్డి ఆనందరావు, మిద్దె శ్రీను, చింతల సత్యనారాయణ పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

వైరాటౌన్, మే 7: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి రానున్నట్లు బీఆర్ఎస్ వైరా పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, సోషల్ మీడియా కన్వీనర్ మోటపోతుల సురేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిట్టపల్లి గ్రామంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరవుతారని, అనంతరం మిట్టపల్లిలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ బీ సరిత

ఖమ్మం రూరల్, మే 7: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని కూసుమంచి డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు బీ.సరిత అన్నారు. బుధవారం మండలంలోని గోళ్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఇన్‌చార్జి ఏవో నాగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. ధాన్యాన్ని తీసుకవచ్చిన రైతులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కాంటాల ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏదులాపురం సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మన్‌నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న డబ్బులు చెల్లించని సీడ్ కంపెనీ

పోలీసులను ఆశ్రయించిన రైతాంగం

రైతులతో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

కొణిజర్ల, మే 7: ఆడ, మగ మొక్కజొన్న సాగు చేయించిన ఓ విత్తన కంపెనీ ఏజెంట్ రైతులకు చెల్లించాల్సిన రూ.2 కోట్లను చెల్లించకుండా తిరుగుతుండడంతో రైతాంగం బుధవారం పోలీసులను ఆశ్రయించారు. బహుళ జాతి కంపెనీలకు చెందిన రెండు రకాల విత్తనాలను ఓ ప్రైవేటు ఏజెంట్ ద్వారా కొణిజర్ల మండలంతో పాటు, పరిసర మండలాల్లో ఆడ, మగ మొక్కజొన్నను సాగు చేశారు. పండించిన మొక్కజొన్న పంటను ఏజెంట్ ద్వారా కొనుగోలు చేసిన సదరు కంపెనీలు పంటకు సంబంధించిన బాకీలు చెల్లించడం లేదు. సదరు ఏజెంట్ కొద్ది రోజులుగా కనబడకపోవడంతో మంగళవారం అర్ధరాత్రి తన స్వగ్రామం తీగలబంజరలో కాపు కాసి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రైతాంగానికి పంట నగదుతో పాటు, నష్టపరిహారంగా చెల్లించాల్సిన మొత్తం సుమారు రూ.2 కోట్ల వరకు ఉంటుందని రైతులు తెలిపారు.

కంపెనీ బాధ్యత వహించాలి

ఆడ, మగ విత్తన సాగు చేసిన రైతాంగానికి కంపెనీలే నేరుగా రైతాంగం అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. అటు ఏజెంట్, ఇటు కంపెనీ ప్రతినిధులు రైతులకు న్యాయం చేయాలని, లేకుంటే విత్తన కంపెనీలను భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో అడుగు పెట్టనివ్వకుండా ఉద్యమం చేస్తామన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల నిరసన

వైరాటౌన్, మే 7: అకాల వర్షాలతో ధాన్యం రైతులు అల్లాడుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించడం లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం వైరా మండలంలో ఈదురు గాలులతో వచ్చిన వడగండ్ల వానతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని తెలంగాణ రైతు సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. వైరా వ్యవసాయ మార్కెట్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలన ధాన్యం ఆరబెట్టే దాకా వర్షం నీరు బయటకు పోయే అవకాశం లేక ధాన్యం మొత్తం తడిసిపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ధాన్యం కొనుగోళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరి వెంకటేశ్వరరావు, కామినేని రవి, మాడపాటి మల్లికార్జున్, మాడపాటి వెంకట్, సామినేని గోవిందరావు, అమరనేని వెంకటేశ్వరరావు, ఆళ్ళ శ్రీనివాస్, కొణిదెన రాజేంద్రప్రసాద్, ధర్మారావు, నల్లమోతు రాజాబాబు, ప్రసాద్ కృష్ణ, మాడపాటి రాజేశ్ పాల్గొన్నారు.

వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షునిగా బుచ్చి రామారావు

వైరాటౌన్, మే 7: వైరా లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడిగా క్లబ్ సీనియర్ సభ్యులు ఏడు నూతల బుచ్చిరామారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వైరా క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. వైరాలోని శ్రీసాయి మందిరంలో బుధవారం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రంగా సత్యనారాయణ, రెండో వైస్ ప్రెసిడెంట్‌గా ఏపూరి రాజారావు, సెక్రటరీగా చెరుకూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా గద్దె నీరజ, జీఎస్టీ కోఆర్డినేటర్‌గా కన్యదారి హనుమాయమ్మ, జీఎంటీ కోఆర్డినేటర్‌గా కొల్లా రాంబాబు, జీఈటీ కోఆర్డినేటర్‌గా షేక్ లాల్ మహ్మద్, క్లబ్ పీఆర్‌వో పులి కృష్ణార్జున్‌రావు ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వుండ్రు శ్యామ్‌బాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, పెనుగొండ ఉపేందర్‌రావు, అబ్బూరి రమేష్, వనమా విశ్వేశ్వరరావు, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, నూకల శ్రీనివాసరావు, నూకల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

'మా పాప- మా ఇంటి మణిదీపం'

మధిర: ఆడపిల్ల తల్లిదండ్రులను సన్మానిస్తున్న అధికారులు; వేంసూరు: సన్మాస్తున్న ఐసీడీఎస్ అధికారులు, పెనుబల్లి: దంపతులను సన్మానిస్తున్న అధికారులు

రఘునాథపాలెం, మే 7 : ఆడపిల్లలు ఇంటికి వెలుగునిచ్చే మణిదీపాలని, ఆడపిల్లల సంరక్షణ బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ప్రతి బుధవారం జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న 'మా పాప-మా ఇంటి మణి దీపం'లో భాగంగా జింకలతండా గ్రామంలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ఆడపిల్ల తల్లిదండ్రులు బేగం-షరీఫ్ దంపతులకు స్వీట్ బాక్స్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ పాపను ఎత్తుకొని లాలిస్తూ పాప చిరునవ్వుకు మురిసిపోయారు. దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కే రాంగోపాల్ రెడ్డి, తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఆర్ఐ ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: చిన్నారిని ఎత్తుకుని ఆడిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మధిరలో..

మధిర, మే 7: మున్సిపాలిటీ పరిధిలోని లడకబజార్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'మా పాపా- మా ఇంటి మణిదీపం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడబిడ్డకు జన్మనిచ్చిన షేక్ సుభాని, కరిష్మాను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ సంపత్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో బాల త్రిపుర సుందరి, సూపర్‌వైజర్లు కే.జ్యోతికుమారి, టీ.సుజాతకుమారి, పీ.అన్నపూర్ణ, జే.సత్యావతి, వార్డు ఆఫీసర్ షేక్ గౌస్‌బేగ్, ఆశావర్కర్ ముంతాజ్, ఏఎన్ఎం వై.లక్ష్మి, హెల్త్‌సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, లంకా కొండయ్య పాల్గొన్నారు.

జయలక్ష్మీపురంలో..

వేంసూరు, మే 7: మండలంలోని జయలక్ష్మీపురం గ్రామంలో మా ఇంటి మణిదీపం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.భవానీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గ్రామంలో కల్యాణి, చంద్రశేఖర్ దంపతులకు ఆడపిల్ల జన్మనివ్వడంతో వారిని సన్మానించి ప్రశంసాపత్రాన్ని, స్వీట్‌బాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేముల చిట్టెమ్మ, గాదె ప్రసాద్, హెల్త్‌సూపర్‌వైజర్ ఫాతిమా, అంగన్‌వాడీ టీచర్ రజిని, ఇందిరా, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉప్పలచిలకగ్రామంలో..

పెనుబల్లి, మే 7: మండలంలోని ఉప్పలచిలక గ్రామం లో మా ఇంటి మణిదీపం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కల్లూరు ప్రాజెక్టు పెనుబల్లి మండలం ఏసీడీపీ మెహరున్నిసా మాట్లాడుతూ విద్య, వైద్య క్రీడా రంగం తదితర అన్ని రంగాల్లో మహిళలు సాధించే విజయాలు అగ్రస్థానంలో ఉన్నాయన్నారు. ఉప్పలచిలక లో బాలింతల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను సన్మానించి స్వీట్‌బాక్స్, ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సుజాత, హెల్పర్ సెక్రటరీ రాజేష్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేమిడిచర్లలో..

ఎర్రుపాలెం, మే 7: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేక అధికారి, మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయచంద్ర పాల్గొని తల్లిదండ్రులకు శాలువాలతో సత్కరించి స్వీట్ బాక్స్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, ఏసీడీపీవో కృష్ణశ్రీ, ఏవో సాయిశివ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్స్, హెల్త్‌సిబ్బంది పాల్గొన్నారు.

బోడతండాలో..

తిరుమలాయపాలెం, మే 7: మండలంలోని మహ్మదాపురం గ్రామపంచాయతీ శివారు బోడతండాలో బుధవారం మా ఇంటి మణిదీపం కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు బోడ అనీల్, భూమిక దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పుల్లయ్య, మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారామరెడ్డి, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రావోజీతండాలో..

కారేపల్లి, మే 7: మండలంలోని రావోజీతండాలో బుధవారం మాఇంటి మణిదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన దంపతులను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. మండల ప్రత్యేకాధికారి నవీన్‌బాబు మాట్లాడుతూ నేటి సమాజంలో అన్ని రంగాలల్లో అమ్మాయిలు ముందుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సపంత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీందర్‌ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవేంద్ర, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: చిన్నారిని ఆశీర్వదిస్తున్న అధికారులు, తిరుమలాయపాలెం: బోడతండాలో ఐసీడీఎస్ అధికారులు, కారేపల్లి: దంపతులను సన్మానిస్తున్న అధికారులు

10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మం, మే 7 : ఈడీసీ సెంటర్‌లో పని చేసేందుకు ఆసక్తి గలవారు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటుచేసే ఈడీసీ కేంద్రాల వద్ద ఒక మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌ను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వివరాల కోసం www.nimsme. gov. in వెబ్‌సైట్ లేదా సమీకృత కలెక్టరేట్‌లోని జనరల్ మేనేజర్, పరిశ్రమలశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

ఖమ్మం, మే 7 : నెలవారీ తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్ రూం సీల్‌ను పరిశీలించి, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, డ్యూటీలో సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఆయన వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ, అధికారులు ఉన్నారు.

పోలీస్ సిబ్బందికి శిక్షణ

ఖమ్మం, మే 7 : ఆటోమేటెడ్ మల్టీ-మోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ అనేది నేరం జరిగిన ప్రదేశాల నుంచి నేరస్తుల వేలిముద్రలు, అరచేతి ముద్రలు, ఐరిస్ స్కాన్ డేటా ఆధారంగా నేరాలను గుర్తించడానికి ఒక అధునాతన నేర గుర్తింపు వ్యవస్థ అని క్లూస్ టీమ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు. పోలీస్ సిబ్బందికి ఏఎంబీఐఎస్ సాంకేతికత పరిజ్ఞానాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకునేందుకు బుధవారం ఒక రోజు శిక్షణ తరగతులు పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. ఈ విధానం 100శాతం కచ్చితత్వంతో నేరస్తులను గుర్తించడంలో సహాయపడుతుందని తెలిపారు.

'అంకుర'లో అరుదైన ఆపరేషన్

30రోజుల బాలుడికి బ్రెయిన్ సర్జరీ

బాలుడిని డిశ్చార్జ్ చేస్తున్న అంకుర వైద్యుల బృందం

ఖమ్మం సిటీ, మే 7 : ఖమ్మం అంకుర హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్ జరిగింది. కేవలం ముప్పై రోజుల వయస్సున్న బాలుడికి హైరిస్క్ బ్రెయిన్ సర్జరీని విజయవంతంగా పూర్తిచేశారు. స్థానిక వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధిర నియోజకవర్గానికి చెందిన దంపతులకు నెలలు తక్కువగా బాలుడు జన్మించాడు. బ్రెయిన్‌లో నరాలు చిట్లిపోయి మెదడులో రక్తస్రావం కావడంతో చిన్నారి ఉలుకూపలుకూ లేకుండా అపస్మాకర స్థితిలోకి వెళ్లాడు. తల్లిదండ్రులు ఖమ్మంలోని వివిధ ఆసుపత్రులకు తీసుకెళ్లగా విజయవాడ లేదా హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆర్థిక స్థోమత లేక ఆ దంపతులు ఖమ్మంలోని అంకుర ఆసుపత్రిని ఆశ్రయించారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ వరుణ్ జొన్నలగడ్డ బాలుడిని పరీక్షించి బ్రెయిన్ సర్జరీకి ముందుకొచ్చారు. ఆయన సారథ్యంలోని అనస్తీషియా డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ జ్యోత్స్న, పిడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ అపర్ణ, డాక్టర్ శ్వేత, ఓటీ స్టాఫ్ కలిసి దాదాపు మూడున్నర గంటలపాటు శ్రమించి బాలుడికి బ్రెయిన్ సర్జరీని విజయవంతంగా పూర్తిచేశారు. చిన్నారి త్వరగా కోలుకోవడంతో బుధవారం ఆసుపత్రి నుంచి ఇంటికి పంపించారు. వైద్యులను అంకుర హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాకేష్ ప్రత్యేకంగా అభినందించారు.

ఖమ్మంలో కాంగ్రెస్ మీటింగ్ రగడ

మంత్రి తుమ్మల తీరుపై ఓ నేత ఫైర్

ఖమ్మం, మే 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీలో విభేదాలు మళ్లీ రచ్చకెక్కాయి. ఖమ్మం నగరం ఎన్నెస్పీ క్యాంపులోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశం వివాదస్పదమైంది. కార్పొరేటర్ కమర్తపు మురళీ సమావేశాన్ని నిర్వహించే ప్రయత్నం చేయగా సీనియర్ నాయకులంతా గుస్సా అయ్యారు. ప్రోటోకాల్ ప్రకారం నగర అధ్యక్షుడు జావీద్ ఉండగా సమావేశాన్ని అన్నీ తానై వ్యవహరించడంపై నిలదీశారు. జావీద్ సైతం మురళీ తీరును ప్రశ్నించి మైక్ తీసుకొని సమావేశాన్ని కొనసాగించాడు. అదేవిధంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడి సమావేశం నుంచి నిష్క్రమించారు. మంత్రి వెంటే సభకు హాజరైన నేతలంతా వెళ్లిపోతుండగా.. పార్టీ ఏఐసీసీ సభ్యుడిగా ఉన్న చోటేబాబా సభలో మంత్రి తుమ్మల వ్యవహరించిన తీరుపై ఫైరయ్యాడు. తన పేరు ప్రస్తావించకుండా అవమానించాడని, నిన్నమొన్న వచ్చి మంత్రి తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీని భ్రష్టుపట్టిస్తున్నాడని ఊగిపోయాడు. తీరు మార్చుకోకుంటే పార్టీకి తీవ్రనష్టం వాటిల్లుతుందంటూ ఒకరికొకరు మాట్లాడుకోవడం కనిపించింది.

నేడు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు శంకుస్థాపన

రఘునాథపాలెం, మే 7 : మండల కేంద్రం రఘునాథపాలెం బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మాణం చేపట్టే ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన జరగనుంది. ఉదయం 10గంటలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరై శంకుస్థాపన చేయనున్నారు.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 7 : ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందిన ఘటన ఆంధ్రా-ఒడిశా బోర్డర్ ఏపీ రాష్ట్రం అల్లూరి జిల్లా సరిహద్దుల్లో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు(ఏఎస్ఆర్) జిల్లా వై-రామవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీస్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో 4ఏ గ్రేహౌండ్స్ యూనిట్ భద్రతా దళాలు యార్లగడ్డ పంచాయతీ పరిధి దూమకొండ అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా.. వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన గ్రేహౌండ్స్ బలగాలు ఎదురుకాల్పులకు దిగారు. భీకరపోరులో భద్రతా దళాల ధాటికి తాళలేక మావోయిస్టులు పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత గ్రేహౌండ్స్ బలగాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. మృతిచెందిన ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతోపాటు రెండు ఏకే-47 ఆయుధాలు, ఇతర ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో రూ.20 లక్షల రివార్డు ఉన్న మావోయిస్టు కీలక నేత జగన్ అలియాస్ పండన్న, మరో మావోయిస్టు రమేశ్ ఉన్నట్లు ఏఎస్ఆర్ జిల్లా పోలీస్ అధికారులు వెల్లడించారు.

ఉప సర్పంచ్‌ని హత్య చేసిన మావోయిస్టులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 7: ప్రతీకారేచ్ఛతో రగలిపోతున్న మావోయిస్టులు ఓ గ్రామ ఉప సర్పంచ్‌ను దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా జగర్‌గూండ పోలీస్‌స్టేషన్ పరిధి తార్లగూడ ఆధారిత బెస్‌పల్లి గ్రామ ఉప సర్పంచ్ ముచకి రామ మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామీణ దుస్తుల్లో వచ్చిన సుమారు ఐదుగురు మావోయిస్టులు అతడిని ఇంట్లో నుంచి బయటకు బలవంతంగా లాక్కొచ్చారు. ప్రజలు చూస్తుండగానే అతడి గొంతు కోసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆలస్యంగా సమాచారం అందుకున్న జగర్‌గూండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రామ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రామ ఆ గ్రామానికి ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

కృష్ణారెడ్డిని పరామర్శించిన లింగాల

కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న లింగాల కమల్‌రాజు, నాయకులు

మధిర, మే 7: మండలంలోని జాలిముడి గ్రామానికి చెందిన ఐలూరి కృష్ణారెడ్డి ఇటీవల ప్రమదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు బుధవారం పరామర్శించారు. ఆయన వెంట మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.

'సాయిస్ఫూర్తి' లో పైథాన్ అడ్వాన్స్ టెక్నాలజీపై వర్క్‌షాపు

సత్తుపల్లిటౌన్, మే 7: స్థానిక సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం అన్ని బ్రాంచీల విద్యార్థులకు 'పైథాన్ అడ్వాన్స్ టెక్నాలజీ'పై మూడు రోజులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బీ.రాజ్‌కుమార్, డాక్టర్ కే.విజయకుమార్, టీ.నాగసాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో డేటా విశ్లేషణ, విజువల్స్, సాధనాల వరకు ప్రాథమిక కాలంలో నేర్చుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి, వైస్‌ప్రిన్సిపాల్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ షేక్ యాకుబ్, కళాశాల సైన్స్ అండ్ హ్యూమానిటీ విభాగాధిపతి షేక్ మీరాసాహేబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు కూలీలకు కనీస వేతనం చెల్లించాలి

తిరుమలాయపాలెం, మే 7: రైతు కూలీలకు కనీస వేతనాలు చెల్లించాలని సీపీఐ(ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా) పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పిండిప్రోలులో రాయల వెంకటనారాయణ భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని కోరారు. సమావేశంలో నాయకులు కమ్మకొమటి నాగేశ్వరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, పులుగుజ్జు వెంకటస్వామి, ఆరెంపుల వెంకన్న, నామ అప్పారావు పాల్గొన్నారు.

హత్యకేసులో ముగ్గురికి జీవితఖైదు

ఖమ్మం లీగల్/తిరుమలాయపాలెం, మే 7: తిరుమలాయపాలెం మండలం మేకలతండా పంచాయతీ శివారు కుక్కలతండాలో భూతగాదాల నేపథ్యంలో జరిగిన హత్యకేసులో ముగ్గురు నిందితులకు జీవితఖైదు, మిగతా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం జిల్లా జడ్జి జి.రాజగోపాల్ బుధవారం తీర్పుచెప్పారు. ప్రాసీక్యూషన్ కథనం ప్రకారం.. జూలై 23, 2023న బోడ రవి భూమిని దున్నుతుండగా అదే గ్రామానికి చెందిన ఇస్లావత్ భద్రు మరికొందరు వచ్చి అడ్డుకున్నారు. ఇస్లావత్ కిషన్ అలియాస్ కిషన్ నాయక్ వచ్చి భద్రును కర్రతో కొట్టాడు. భద్రు కిందపడగానే వెంటనే మరో నిందితుడు ఇస్లావత్ సేవా వచ్చి రాయితో తలపై కొట్టగా భద్రు స్పృహ కోల్పోయాడు. మిగతా నిందితులు కర్రలతో దాడి చేశారు. భద్రును ఆసుపత్రికి తరలించగా జూలై 29న మృతిచెందాడు. భద్రు బంధువుల ఫిర్యాదు మేరకు తిరుమలాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వపరా